# ఇంటి నంబర్లు ఇవ్వడంలో జాప్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, జూన్ 18 : వికారాబాద్ మున్సిపల్ పరిధిలో కొత్తగా నిర్మించే ఇండ్లకు ఇంటి నంబర్లు ప్రభుత్వ నిబంధన ప్రకారం ఇవ్వాల్సిందేనని, అలా కాకుండా ఎవరైనా అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు మున్సిపల్ రెవెన్యూ విభాగంతో చైర్ పర్సన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సేవలు అందించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. వికారాబాద్ పట్టణంలో కొత్తగా నిర్మించిన ఇండ్లకు ఇంటి నంబర్లు కేటాయించడంలో రెవెన్యూ సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నారని తన దృష్టికి రావడంతో ఇలాంటివి ఇకపై పునరావృతం కాకూడదని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం మున్సిపల్‌కు మరింత ఆదాయం వచ్చేలా రెవెన్యూ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఆర్వో కృపాకర్, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

### నల్లా కనెక్షన్ వివరాలు యాప్‌లో నమోదు

కులకచర్ల, జూన్ 18 : నల్లా కనెక్షన్ వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నట్లు కులకచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కులకచర్ల మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి నల్లా కనెక్షన్ వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నల్లాలు ఉన్నవారు ఎంతమంది, లేనివారు ఎంతమంది ఉన్నారు అనే విషయాన్ని తెలుసుకునేందుకు ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీలోని అన్ని ఇండ్లకు తిరిగి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మండల సమావేశం

మర్పల్లి, జూన్ 18 : మర్పల్లి మండల కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ లలితా రమేశ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజమల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.. ఈ సందర్భంగా మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖాల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

## రేపు రక్తదాన శిబిరం

కులకచర్ల, జూన్ 18 : కులక చర్ల మండల కేంద్రంలో ఈ నెల 20 వ తేదీన రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు రామచంద్రయ్య, చంద్రలింగం, వినోద్, కృష్ణ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు మండల పరిధిలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో సామాజిక వేత్త, యువ నాయకుడు కుమ్మరి స్వామి పుట్టిన రోజు సందర్భంగా అభిమానులు రక్తదానం చేయనున్నట్లు తెలిపారు.

## పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



దోమ, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్ అన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిష్టాపూర్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనీఫామ్, వర్క్, నోట్‌బుక్స్‌లతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు గుర్తు చేశారు. విద్యార్థులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలను ఉచితంగా సమకూరుస్తున్న విషయాన్ని గ్రహించి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తుల నమోదు



వికారాబాద్, జూన్ 18 : వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా మంగళవారం ప్రజలు ప్రజా పాలనలో ఇప్పటి వరకు అందని పథకాలపై మరో సారి నమోదు చేసుకుంటున్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న కొంత మందికి పథకాలు అందుతున్నాయి. రాని వారు ప్రజా పాలన దరఖాస్తు ఫారమ్‌తో మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడున్న సిబ్బంది వెంటనే ఆన్‌లైన్ ద్వారా సరి చూసి నమోదు లేని వాటికి వెంటనే నమోదు చేస్తున్నారు.

## కరెంట్ సమస్యకు పరిష్కారం



గౌతాపూర్ –కరణ్‌కోట మధ్య 33 కేవీలైన్ మరమ్మత్తు చేస్తున్న సిబ్బంది.

తాండూరు రూరల్, జూన్ 18 : తాండూరు మండలం గౌతాపూర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ సమస్యకు ట్రాన్స్‌కో అధికారులు చెక్ పెట్టారు. మంగళవారం గౌతాపూర్ – కరణ్‌కోట ఫీడర్ ఇంటర్ లింక్ చేశారు. 33 కేవీ లింక్‌లైన్ పని పూర్తి చేశారు. ఈ పని పూర్తవ్వడం వల్ల గౌతాపూర్ సబ్ స్టేషన్‌లో బ్రేక్ డౌన్ అవుతే కరణ్‌కోట సబ్ స్టేషన్ నుంచి గౌతాపూర్‌కు విద్యుత్ సబ్ స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా చేసే అవకాశం కల్పించారు. అదేవిధంగా కరణ్‌కోట సబ్ స్టేషన్ బ్రేక్ డౌన్ అవుతే గౌతాపూర్ సబ్ స్టేషన్ నుంచి కరణ్‌కోటకు కరెంట్ సరఫరా చేసే అవకాశాన్ని కల్పించినట్లు లైన్‌మెన్ వెంకటయ్యగౌడ్ తెలిపారు. రాబోయే రోజుల్లో కరెంట్ కోత ఉండదని ఆయన తెలిపారు. ఏడీ ఆదినారాయణరెడ్డి, ఏఈ ఆదేశాల మేరకు పనులు పూర్తి చేశామని ఆయన తెలిపారు.

## బడీడుపిల్లలను బడుల్లో చేర్పించాలి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఆర్‌బీవోఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సరళా శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు రూరల్, జూన్ 18: ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని తాండూరు ఆర్‌బీవోఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సరళా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు మండలం, కరణ్‌కోటలోని ప్రభుత్వ పాఠశాలలో ఉత్తర కర్నాకట ప్రాంతానికి చెందిన మల్లిఖార్జున ముత్య(అప్పాజీ) జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు విద్యపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను బడులకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శరణుబసప్ప, ఎంపీటీసీ రాజ్‌కుమార్, హెచ్‌ఎం జి.నర్సిరెడ్డి, శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఓం ట్రేడింగ్ కంపెనీకి నోటీసులు

కొడంగల్, జూన్ 18 : పట్టణంలోని ఓం ట్రేడింగ్ కంపెనీకి మండల వ్యవసాయాధికారి లావణ్య నోటీసులు ఇచ్చారు. మంగళవారం ఆమె కంపెనీని సందర్శించి అందులోని 102 మెట్రిక్ టన్నుల యూరియా, 55 మెట్రిక్ టన్నుల డీఏపీ, 68 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను పరిశీలించి వీటిని విక్రయించరాదని నోటీసులు అందజేశారు. ఈ ఎరువుల విలువ రూ. కోటి వరకు ఉంటుందని ఆమె తెలి పారు. ఇందులో ప్రత్యేకంగా అన్నపూర్ణ కంపెనీకి సంబంధించిన విత్తనాలు, విజయదుర్గ ఏపీ 30 రకం విత్తనాలు అమ్మ వద్దని ఆదేశించారు. వీటిని 21 రోజుల పాటు అమ్మరాదని నోటీసులో ఏవో పేర్కొన్నారు

## చోరీల కలకలం

బొంరాస్‌పేట, జూన్ 18 : బొంరాస్‌పేట మండల కేంద్రంలో సోమవారం రాత్రి మూడు ఇళ్లలో జరిగిన దొంగతనాలు కలకలం రేపాయి. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకున్న దొంగలు చోరీలకు పాల్పడ్డారు. గ్రామానికి చెందిన గొట్టిముక్కుల రాజేశ్ ఇంట్లో దొంగలు తులం బంగారం, రూ.20 వేల నగదు, చిట్లపల్లి పద్మమ్మ ఇంట్లో కొంత నగదుతో పాటు వెండి, బంగారం ఎత్తుకెళ్లారు. కటికె రవి ఇంటి తాళాలు పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి ఇళ్లను పరిశీలించారు. గత నెలలో ఒక కిరాణ దుకాణంలో జరిగిన దొంగతనం మరిచి పోకముందే గ్రామంలో మళ్లీ దొంగతనాలు జరగడం పట్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లు విడిచి వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

# పసిపిల్లల విక్రయాల ముఠా అరెస్టు

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): పసి పిల్లలను విక్రయిస్తున్న ముఠాకు చెందిన 12 మందిని మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసి, 9 మంది పసి పిల్లలను రెస్క్యూ చేశారని రాచకొండ సీపీ తరుణ్ జోషి వెల్లడించారు. గత నెలలో మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన పసిపిల్లల విక్రయ ముఠా వ్యవహారంపై తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులతో కలిసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మేడిపల్లి పోలీసులు 11 మంది నిందితులను అరెస్ట్ చేసి, 14 మంది పసి పిల్లలను రెస్క్యూ చేసిన విషయం తెలిసిందే. ఈ ముఠా 60 మంది పసి పిల్లలను విక్రయించినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్రంలో 12 మందిని అరెస్టు చేయగా.. అందులో ఐదుగురికి మేడిపల్లి పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుతో సంబంధం ఉన్నదని, పీటీ వారెంట్‌పై నిందితులను కస్టడీలోకి తీసుకోవాల్సి ఉన్నదన్నారు.

### వరుస స్నాచింగ్‌లు చేసింది అదే గ్యాంగ్..

నగర శివారు ప్రాంతాల్లోని జవహర్‌నగర్, శామీర్‌పేట ఠాణా పరిధిలోని కేశవరం, అంతారం గ్రామాలతో పాటు సిద్దిపేట జిల్లాలోని చేర్యాల ఠాణా పరిధిలో వరుసగా నాలుగు స్నాచింగ్ ఘటనలు జరిగాయి. ఈ ఘటనలు చేసింది యూపీకి చెందిన భవారియా గ్యాంగ్‌గా గుర్తించామని రాచకొండ సీపీ వెల్లడించారు. గతంలోనూ ఉత్తర్‌ప్రదేశ్, షామ్లీ జిల్లాకు చెందిన ఈ భవారియా గ్యాంగ్ నగరంలో స్నాచింగ్ ఘటనలకు పాల్పడిందన్నారు. ఈ ముఠాను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపామన్నారు. అలాగే, ప్రజలను కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బైక్‌పై వెళ్లిన దుండగుల ఫొటోలు సీసీ కెమెరాల్లో పరిశీలించిన పోలీసులు.. ఆ వాహనం నంబర్‌ను పరిశీలించగా.. అది నకిలీ నంబర్ అని తేలింది.

### ప్రియురాలిపై అనుమానం..

## దాడి చేసిన ప్రియుడు

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): వివాహమై విడాకుల కోసం ఎదురు చూస్తున్న ప్రియురాలిపై అనుమానంతో ప్రియుడు ఆమెను వెంబడించి ఇంట్లోకి వెళ్లి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన మంగళవారం ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఛత్రినాక పోలీసుల కథనం ప్రకారం.. ఛత్రినాకకు చెందిన యువతికి 2019లో ఓ వ్యక్తితో వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్ధలు రావడంతో విడాకుల కోసం కోర్టుకెళ్లారు. దీంతో ఆమె తల్లి వద్దనే ఉంటున్నది. కాగా, గౌలిపురాకు చెందిన మణికంఠ, యువతికి చిన్ననాటి స్నేహితుడు. వీరి స్నేహం ప్రేమగా మారింది. పెండ్లి చేసుకోవాలంటూ మణికంఠ ఆమె వెంటపడుతున్నాడు. విడాకులు మంజూరైన తరువాత పెండ్లి చేసుకుందామంటూ ఆమె కొన్నాళ్లుగా మణికంఠను దూరం పెడుతున్నది. తనను దూరం పెట్టి మరొకరితో ప్రేమ వ్యవహారాన్ని నడుపుతుందనే అనుమానం మణికంఠకు వచ్చింది. ఈ అనుమానం రోజు రోజుకు ముదిరిపోయింది. మంగళవారం ఉదయం యువతి జిమ్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చింది. ఆమెను వెంబడిస్తూ ఇంట్లోకి చొరబడ్డాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంట్లోకి వెళ్లగానే గడియా పెట్టాడు. అప్పటికే యువతి ఫోన్‌లో మాట్లాడుతుంది. ఆగ్రహంతో ఊగిపోయిన మణికంఠ.. ఆమెపై తన వద్ద ఉన్న స్క్రూ డ్రైవర్‌తో ఛాతి, ముఖంపై దాడి చేయడంతో ఆమె పెద్దగా అరుస్తూ తప్పించుకునే ప్రయత్నం చేసింది. స్థానికులు వచ్చి మణికంఠను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. యువతి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

# యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకోవాలి

### మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డి.సి. ఉమాపతి రావు



మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఉమాపతిరావును సన్మానించిన బన్సీలాల్‌పేట సేవా సంఘం నాయకులు

బన్సీలాల్‌పేట, జూన్ 18: విద్య వల్లే సమాజంలో అసమానతలు తొలిగిపోతాయని గుర్తించి చదువుకోవడానికే యువత ప్రాధాన్యత ఇవ్వాలని నాలుగో ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు అన్నారు. నూతనంగా మెజిస్ట్రేట్‌గా నియమితులైన సందర్భంగా ఆయనను బన్సీలాల్‌పేట సేవా సంఘం అధ్యక్షుడు బి.మోహన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ధన్యవాదములు తెలుపుతూ.. ఉమాపతిరావు ప్రసంగించారు. బన్సీలాల్‌పేట బస్తీలోని నిరుపేద కుటుంబంలో పుట్టి, పెరిగిన తనను తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించారని అన్నారు. బాల్యంలో తన తండ్రిని ఇద్దరు న్యాయవాదులు మోసం చేశారన్నారు. ఇకముందు నిరుపేదలకు మోసం జరగకుండా ఉండాలంటే న్యాయవాది కావాలనే సంకల్పం.. అమ్మానాన్నల ప్రోత్సాహంతో డిగ్రీ వరకు చదివానని, అనంతరం 23 ఏండ్ల కిందట ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశానని తెలిపారు. సీనియర్ న్యాయవాది సీహెచ్.యాదగిరి ఆధ్వర్యంలో హైకోర్టులో అనేక కేసులను వాదించానన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా బడుగు, బలహీనవర్గాల యువత జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని సూచించారు. అధిక సమయం సెల్‌ఫోన్ చూస్తూ కాలాన్ని వృథా చేయకూడదని చెప్పారు. మెజిస్ట్రేట్‌గా ఉన్నప్పటికీ బడుగు, బలహీనవర్గాల నిరుపేద ప్రజలకు తాను అందుబాటులో ఉంటానని, ఎలాంటి న్యాయసలహాలు అవసరమున్నా నేరుగా వచ్చి తనను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సన్మానసభలో బీఆర్‌ఎస్ నాయకుడు కె.లక్ష్మీపతి, బన్సీలాల్‌పేట సేవా సంఘం సభ్యులు జానకీ రాములు, జయప్రకాశ్, రంగారావు, బాబూరావు, జగదీశ్, బాల్‌రాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### చెడు వ్యసనాలకు అలవాటు పడి ..

## దోపిడీలకు పాల్పడుతున్న మైనర్లు

హిమాయత్‌నగర్, జూన్ 18: చెడు వ్యసనాలకు (గంజాయి, వైట్నర్) అలవాటు పడి రహదారులపై రాత్రి వేళ్లలో దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు మైనర్లను పోలీసులు అరెస్టు చేసి, జువైనల్ హోంకు తరలించారు. ఈ ఘటన నారాయణగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం నారాయణగూడలోని పీఎస్ ఆవరణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్, డీఐ నాగార్జున ఈ కేసు వివరాలను వెల్లడించారు. హిమాయత్‌నగర్‌లోని బర్గర్ కింగ్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేసే దినేశ్‌రెడ్డి విధులు ముగించుకుని హాస్టల్‌కు వెళ్తున్నాడు. హిమాయత్‌నగర్ వీధి నం.11 వద్ద అకస్మాత్తుగా హోండా వాహనంపై వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు ఇవ్వాలని అతడిని డిమాండ్ చేశారు. దినేశ్‌రెడ్డి తన వద్ద డబ్బులు లేవని చెప్పగా.. సెల్‌ఫోన్ ఇవ్వాలని అడిగారు. సెల్‌ఫోన్‌ను వారికి ఇవ్వకుండా నిరాకరించడంతో దినేశ్‌రెడ్డిపై కత్తితో దాడి చేసి బెదిరించారు. సెల్‌ఫోన్‌ను లాక్కొని అక్కడి నుంచి పారిపోయారు. దీంతో దినేశ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఘటనా స్థలం సమీపంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా.. చేసిన నేరాన్ని అంగీకరించారు. వీరిలో ఓ మైనర్ (నిందితుడు) గతంలో ఓ గ్యాంగ్ రేప్ కేసులో జైలు శిక్ష అనుభవించి వచ్చాడు. ఈ ముగ్గురు దోపిడీలకు పాల్పడ్డారని నిర్ధారించి.. వారిని జువైనల్ హోంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బిల్డింగ్ పై నుంచి పడి యువకుడి మృతి

అడ్డగుట్ట, జూన్ 18: ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మెట్టుగూడ రమణశ్రీ అపార్టుమెంటు ప్రాంతానికి చెందిన రాపోలు సురేశ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు రాహుల్(17) ఉన్నారు. రాహుల్ ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 17వ తేదీన రాహుల్ బిల్డింగ్‌పైన తన నలుగురు స్నేహితులతో కలిసి మద్యం సేవించాడు. మద్యం సేవించిన అనంతరం కిందికి దిగే క్రమంలో రాహుల్ భవనం ఐదవ అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. వెంటనే రాహుల్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. సురేశ్ ఫిర్యాదు మేరకు చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

### విపత్తు నిర్వహణలో

## ప్రజల భాగస్వామ్యం అవసరం

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): శేరిలింగంపల్లిలోని జేపీ మోర్గాన్ సర్వీసెస్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం ఫైర్ అండ్ డిజాస్టర్ సేఫ్టీ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈవీడీఎం డైరెక్టర్ ఎన్.ప్రకాశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని.. విపత్తు నిర్వహణ, భద్రతా చర్యలపై వివరించారు. విపత్తు నిర్వహణలో వినియోగించే పరికరాలు, వాటి ప్రాధాన్యతను తెలియజేశారు.

### నకిలీ పాస్‌పోర్టుకేసులో..

# కస్టడీకి రీజినల్ పాస్‌పోర్టు ఆఫీసర్

నాంపల్లి కోర్టులు, జూన్ 14 (నమస్తే తెలంగాణ): నకిలీ పాస్‌పోర్టులను జారీ చేసేందుకు ఏజెంట్ల ద్వారా ఒప్పందం కుదుర్చుకున్న రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ ప్రద్యుమ్నకుమార్ బెహరా అలియాస్ పీకే. బెహారాను 3 రోజుల కస్టడీకి అనుమతిస్తూ మంగళవారం 6వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం నుంచి శుక్రవారం వరకు విచారించి, శుక్రవారం సాయంత్రం 5 గంటలలోపు కోర్టు ఎదుట హాజరుపర్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలను ఏకీభవించిన కోర్టు.. కస్టడీకి అనుమతించింది. 28వ నిందితుడిగా ఈ నెల 12న కోర్టు రిమాండ్ విధించింది. విజయవాడ రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసులో సీనియర్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగం చేస్తున్న సమయంలో ఫేక్ సర్టిఫికెట్లతో పాస్‌పోర్టుకు అప్లై చేసుకున్నారు. వారికి నకిలీ పాస్‌పోర్టుల జారీకి నిందితుడు సహకరించినట్లు అధికారులు తెలిపారు. అతడి ద్వారా జారీ అయిన పాస్‌పోర్టుల వివరాలను సేకరించేందుకు కస్టడీకి అప్పగించాలని కోర్టును కోరారు. వాదనల అనంతరం.. కస్టడీ సమయంలో థర్డ్ డిగ్రీ ప్రయోగించరాదని, నిందితుడి న్యాయవాది సమక్షంలో విచారణ చేపట్టాలని ఉత్తర్వులలో సూచించింది.



బన్సీలాల్‌పేట, జూన్ 18: వైద్య విద్యార్థుల కోసం నూతన హాస్టల్ భవనాన్ని నిర్మించడానికి స్థలాలను పరిశీలించేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టీనా చోంగ్తూ మంగళవారం సికింద్రాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీని సందర్శించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ ఎన్.వాణి, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ రవీంద్రకుమార్, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావుతో అకాడమిక్ భవనం, ఫైర్ స్టేషన్ ప్రాంతం, ఆలుమ్ని భవనం పక్కన ఉన్న స్థలాలను పరిశీలించారు.

## విదేశాలకు పంపిస్తామంటూ మోసం

చాదర్‌ఘాట్, జూన్ 18: విదేశాలకు పంపిస్తామని నమ్మించి.. పలువురి నుంచి డబ్బులు వసూలు చేసిన ఓ కన్సల్టెన్సీ బోర్డు తిప్పేయడంతో బాధితులు మలక్‌పేట పోలీసులను ఆశ్రయించారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన గండి కిరణ్‌కుమార్ మలక్‌పేటలో డేడా డెస్టినేషన్ పేరిట కన్సల్టెన్సీ ఏర్పాటు చేశారు. న్యూజిలాండ్, అమెరికా వంటి దేశాలకు పంపిస్తానని చెప్పటంతో పలువురు అతడి మాటలు నమ్మారు. బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లేందుకు పలువురు అప్పులు చేసి కన్సల్టెన్సీ నిర్వాహకులకు సంప్రదించి, రూ.లక్ష నుంచి తొమ్మిది లక్షల వరకు చెల్లించారు. నెలలు గడుస్తున్నా.. విదేశాలకు పంపడం లేదు. నిర్వాహకుడి మాయమాటలు నమ్మి డబ్బులు చెల్లించామని, దాదాపు 15 మంది బాధితుల నుంచి సుమారు రూ. 70 లక్షల వరకు వసూలు చేశారని ఆరోపించారు. కన్సల్టెన్సీకి తాళం వేసి ఉండటంతో బాధితులు ఆఫీసు ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం బాధితులు మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులు జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం..



పరిగి, జూన్ 18 : అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన నమస్తే తెలంగాణ పరిగి టౌన్ రిపోర్టర్ బొంపల్లి రాజు కుటుంబానికి జర్నలిస్టులు బాసటగా నిలిచారు. ఈ మేరకు పరిగి ప్రెస్‌క్లబ్ తరపున రాజు కుటుంబసభ్యులకు మంగళవారం రూ.54వేలు ఆర్థిక సాయం అందజేశారు.

## డ్రగ్స్‌కేసులో..ఆరుగురి అరెస్టు

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు వనస్థలిపురం, భువనగిరి పోలీసులతో కలిసి రెండు అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠాలను పట్టుకున్నారు. ఈ వివరాలను మంగళవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ తరుణ్‌జోషి వెల్లడించారు. హయత్‌నగర్‌కు చెందిన అత్తాపురం భరత్‌రెడ్డి విద్యార్థి. మొదట డ్రగ్స్ అలవాటు చేసుకొని.. ఆ తరువాత డ్రగ్ విక్రేతగా మారాడు. వనస్థలిపురం నివాసి చిక్యాల విఖ్యాత్ కూడా విద్యార్థి. డ్రగ్ విక్రేతగా మారాడు. వీరిద్దరూ స్నేహితులు. హైదరాబాద్‌లో డ్రగ్స్‌కు మంచి గిరాకీ ఉన్న విషయాన్ని గుర్తించి.. బెంగళూర్‌కు నుంచి డ్రగ్స్ తేవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా బెంగళూర్‌కు వెళ్లి రూ.1,200 గ్రాము చొప్పన డ్రగ్స్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో రూ. 4 వేల నుంచి రూ. 5 వేలకు గ్రాము చొప్పున విక్రయించేందుకు ప్లాన్ చేశారు. బెంగళూర్‌లో 26 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ కొని, 16వ తేదీ సాయంత్రానికి హైదరాబాద్‌కు చేరుకున్నారు. 17వ తేదీ రాత్రి 11.20 నిమిషాల సమయంలో ఓ ప్రైవేట్ ఉద్యోగికి డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం రావడంతో డ్రగ్స్ విక్రేతలైన ఇద్దరు స్నేహితులతో పాటు డ్రగ్ వినియోగదారుడు తన్నీర్ హేమంత్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 26 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. భరత్‌రెడ్డిపై గతంలో పలు ఎన్‌డీపీఎస్ కేసులు నమోదయ్యాయి.

### హాషీష్ ఆయిల్ పట్టివేత..

బోరబండకు చెందిన దినేశ్ కారు మెకానిక్. అమృతలూరి హానెస్ట్ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. తాళ్లపల్లి భరణి ప్రైవేట్ ఉద్యోగి. ఈ ముగ్గురు స్నేహితులు. విశాఖపట్టణం పరిధిలోని నర్సీపట్నంలో తక్కువ ధరకు హాషీష్ (గంజాయి) ఆయిల్‌ను కొనుగోలుచేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు ప్లాన్ చేశారు. లీటర్‌కు రూ. 50 వేల చొప్పున కొనుగోలు చేసి హైదరాబాద్‌కు వచ్చారు. 17వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులకు అందిన సమాచారం మేరకు భువనగిరి సర్కిల్ పోలీసుల సహకారంతో అనాజిపురం క్రాస్ రోడ్డులో ముగ్గురు నిందితులతో పాటు రూ.20 లక్షల విలువైన 2 లీటర్ల హాషీష్ ఆయిల్, ఒక కారు, మూడు మొబైల్ ఫోన్లు, రూ. 2,500 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

శంషాబాద్ రూరల్, జూన్ 18: శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు సమాచారం రావడంతో వెంటనే అప్రమత్తమైన భద్రత అధికారులు, సీఐఎస్‌ఎఫ్ అధికారుల బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఎయిర్‌పోర్టు అధికారిక ఈ మెయిల్‌కు బెదిరింపు మెసేజ్ వచ్చింది. వెంటనే భద్రత అధికారులు ఎయిర్‌పోర్టుకు వచ్చే ప్రయాణికులతో పాటు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేశారు. చివరకు ఏమీ లేదని తేలడంతో ఎయిర్‌పోర్టు భద్రత అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎయిర్‌పోర్టు అధికారిక ఈ మెయిల్‌కు వచ్చిన బెదిరింపు మెసేజ్‌పై దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. దీంతో పాటు బెదిరింపు మెసేజ్‌పై ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆటోడ్రైవర్ ఆత్మహత్య

జీడిమెట్ల, జూన్ 18: చెట్టుకు ఉరేసుకొని ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొల్లూరు గ్రామానికి చెందిన ఎరుకల లక్ష్మణ్(34) కుటుంబసభ్యులతో కలిసి నగరానికి వలసొచ్చి పద్మానగర్ ఫేస్–2లో ఉంటున్నాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం ఉదయం స్వగ్రామంలో ఆస్తి విషయంలో అన్నదమ్ముళ్లతో మాట్లాడేందుకు వెళ్తున్నట్టు భార్యకు చెప్పి బయలుదేరాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో భార్య అతడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఇదిలా ఉండగా.. మంగళవారం ఉదయం కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న ఓ చెట్టుకు ఓ వ్యక్తి ఉరేసుకొని కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ సమాచారాన్ని పోలీసులు లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు తెలుపగా.. వారు అక్కడికి వెళ్లి లక్ష్మణ్‌గా గుర్తించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.